

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 89 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 28, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# కేసుల విచారణలో.. వేగమెక్కడ !

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

కేసుల విచారణ వేగవంతం కాకపోవడంతో ప్రభుత్వ యంత్రాంగాలు నిర్వీర్యం అవుతున్నాయని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయం వ్యక్తం చేశారు.మనుషులను బట్టి కేసులు కట్టడం పార్టీలను బట్టి వేధించడం నాయకులను బట్టి నిందించడం అధికారాన్ని బట్టి అక్రమ కేసులు పెట్టడం తెలంగాణ రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతుందన్నారు. సామాన్య ప్రజలను మొదలుకొని సంపన్నుల వరకు అక్రమ కేసులకు బాధితులు అవుతున్నారని అన్నారు. ప్రభుత్వం అండదండలు చూసుకొని కొంత శాతం అధికారులు కొంత శాతం ప్రభుత్వ వ్యవస్థలు అణిచివేత ధోరణిని ప్రదర్శిస్తూ ప్రజా సామ్రాజ్యాన్ని ప్రజాస్వామ్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని మండిపడ్డారు.కొన్ని ప్రధాన సంఘటనలలో పేదలని చూడకుండా బూటు కాలి కింద తొక్కేస్తున్నట్లుగా అణచివేతను ప్రదర్శిస్తున్నారని అయినప్పటికీ ప్రజా సంఘాలు ఉద్యమ సంఘాలు లెఫ్ట్ సంఘాలు,ప్రజా ఉద్యమకారులు, ప్రజారక్షణ పోరాటాలను పూర్తిగా మరచిపోతున్నట్లుగా కనిపిస్తుందన్నారు.గతంలో సమస్యలను వెతుక్కుంటూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే పనిలో అన్ని పార్టీలు ఐక్యంగా పోరాడేవని ప్రస్తుత ప్రభుత్వాలలో ప్రజలను చిత్రహింసలు పెట్టి నాశనం చేస్తున్నప్పటికిని కల్లారా చూస్తున్న పార్టీలన్నీ మాకెందుకులే అనుకుంటూ ముఖం చాటిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. నేరుగా బాధితులే నాయకులకు పోలీస్ అధికారులకు జిల్లా కలెక్టర్ల యంత్రంలకు వాళ్లకు జరుగుతున్న అన్యాయాలను అణిచివేతలను ఆధారాలతో కూడిన సమాచారాలను చేరవేస్తున్నప్పటికిని సమాచారం ఇస్తున్న వ్యక్తులను క్రిమినల్స్ లాగా పరిగణిస్తూ చిత్రహింసల గురి చేస్తున్నారే తప్ప ప్రభుత్వ వ్యవస్థ హక్కులను కాపాడే క్రమంలో క్రిమినల్స్ పై చర్యలు తీసుకుని అణిచివేత దారులపై కఠినంగా వ్యవహరించాలనే ప్రయత్నాలు మాత్రం చేయలేకపోతున్నారని పూర్తిగా విమర్శించారు.మూడు ప్రధాన భాగాలుగా కేసుల విచారణ విశ్లేషణను ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పోలీస్ యంత్రాంగం కడుతున్న కేసుల పట్ల 70 శాతం ప్రజలకు విశ్వాసం సన్నగిల్లిందని దానివల్ల పోలీస్

- మిగతా 2లో..

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

కేసుల "విచారణలలో వేగమెక్కడ

మానసికంగా వేధించాలని దృఢ సంకల్పాలు పెరిగిపోతున్నాయి

నాయకుల వ్యక్తిగత స్వబావాలే వేధింపులకు దారితీస్తున్నాయి

శాఖల పరమైన విచారణలో వేగిరం చేయడం దేనికొరకు

ప్రభుత్వం పెట్టిస్తున్న ప్రధాన కేసుల్లో న్యాయం ఎంత అన్యాయం ఎంత

సుదీర్ఘ కాలపు కేసులన్నీ ముగిసేది ఎన్నడు

రాజకీయాలు అంటేనే కేసులు కట్టడం విచారించడమా

ప్రజాసేవను నిజాయితీగా చేయాలనే దృక్పథం నశించిపోతుంది

అక్రమ కేసులు అగిపోతున్నాయి సక్రమ కేసుల విచారణలు తరిగిపోతున్నాయి

క్రిమినల్స్ ను కాపాడడం కోసం రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుంటున్నారు ?

కేసుల విచారణలో నిజాయితీ లేకే ప్రజా సామ్రాజ్యం నాశనమైపోతుంది : డాక్టర్ బరిగెల శివ



## మావోయిస్టు నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చన్న ముఖ్యమంత్రి

చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేస్తుందని వ్యాఖ్య

ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ పట్టుకుంటే నడవదని మాజీ మావోయిస్టు కీలక వ్యాఖ్య



2

## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో స్పీకర్‌ను కలిసిన మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు

మర్యాదపూర్వకంగా సభాపతిని కలిసిన తెలంగాణ మంత్రులు

మార్చి 5న జరగనున్న కుమారుడి వివాహానికి ఆహ్వానించిన భట్టివిక్రమార్క

అంతకుముందు, కనకదుర్గమ్మను దర్శించుకున్న భట్టివిక్రమార్క



5

## అక్రిడిటేషన్ కార్డుల గడువు రెండు నెలలు పొడిగింపు

3

## తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులకు హార్వర్డ్ యూనివర్సిటీ నిపుణులతో ఎగ్జిక్యూటివ్ శిక్షణ

సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన




3



## హైదరాబాద్ హోటళ్లలో కల్తీ నెయ్యి కలకలం!

హైదరాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌లో కల్తీ నెయ్యి వాడినట్లుగా రిపోర్టు

జీహెచ్ఎంసీ సేకరించిన నమూనాలు అసురక్షితమని ల్యాబ్ రిపోర్ట్

ల్యాబ్ రిపోర్ట్‌ను సవాలు చేసిన నెయ్యి తయారీ సంస్థ

మరోసారి పరీక్షల కోసం నమూనాలను మైసూర్ పంపిన అధికారులు

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# కేసుల "విచారణలలో వేగమెక్కడ

మొదటి పేజీ తరువాయి



యంత్రాంగం తరపున అధికారులు కడుతున్న కేసులన్నీ తప్పులుగా భావిస్తున్నట్లుగా ప్రజల మనోభావాలు తెలియజేస్తున్నాయన్నారు. కేసులన్నీ రాజకీయ నాయకుల కనుసందుల్లో జరుగుతున్నట్లుగా రాజకీయ నాయకులే పోలీసు అధికారులుగా చలామణి అవుతూ వాళ్లకు గిట్టని వాళ్లకు పడని వ్యక్తుల మీద పార్టీల మీద నాయకుల మీద చివరకు పూరి గుడిసెలలో జీవించే పేదవాళ్ళ మీద కూడా పెత్తనం చేస్తూ అక్రమ కేసులు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తూ మానసిక వేధింపులకు గురి చేయడం ఏదైతే ఉందో అట్టిది శాశ్వత చరిత్రహీనమని గుర్తించాల్సిన అవసరం ఉంటుందని తెలుపుతూ అలాంటి చర్యలకు పాల్పడుతున్న నాయకులు ఇకనైనా గమనించక తప్పదన్నారు. కర్మ సిద్ధాంతం అనేది ప్రతి ఒక్కరికి ఒకేలా ఉంటుందని పెద్ద చిన్న తారతమ్య భేదం ఏమీ ఉండదని ఏది తల పెడితే తిరిగి అదే పొందుకోగలమన్న సంగతిని ప్రతి ఒక్కరు గమనించబద్ధులై మెలిగాలన్నారు.ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా పనిచేసే వ్యక్తులు శక్తులు రాజకీయ నాయకులు ప్రభుత్వ యంత్రాంగాలు ప్రతి ఒక్కరు సత్య దూరమైన అంశాలను సత్యంగా పరిగణలోనికి తీసుకొని కేసులు కట్టడం పచ్చి దుర్మార్గం అన్నారు.అందులో భాగంగా ప్రభుత్వాల ఒత్తిడితో నాయకుల ఒత్తిడితో కట్టబడే కేసులే పెద్ద స్థాయిలో నిలిచిపోతున్నాయని అవన్నీ కేవలం కక్షపూరితంగా కట్టబడుతున్నవేనని తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారన్నారు.రెండవదిగా న్యాయస్థానాల కేసులలో జరుగుతున్న విచారణ గతకాలనికి మాదిరిగా కాకుండా పూర్తి భిన్నమైన కోణంలో వాదోపవాదములు జరుగుతున్నాయని ఎక్కువ శాతం నేరస్తులు భూకబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తులు పెద్దపెద్ద న్యాయవాదులను సంప్రదిస్తూ న్యాయస్థానాలను శాసిస్తున్నారని అందులో భాగంగానే న్యాయస్థానాల్లో జరుగుతున్న సంపూర్ణ న్యాయం పేదవానికి ఒకలాగా ఉన్నోనికి ఒకలాగా నేరస్తులకు ఒకలాగా భూకబ్జాదారులకు మరోలాగా ఇలా చెప్పుకుంటూ పోతే పోలీసులు కడుతున్న కేసులు అన్ని పేదవాళ్ళని చిత్రహింసలు పెట్టడానికేనన్న సంగతి న్యాయస్థానాల్లో విడుదలవుతున్నారు తీర్పులను బట్టి స్పష్టంగా వెల్లడవుతుందన్నారు.కొంతమంది న్యాయమూర్తులు ప్రాణాలను లెక్కచేయకుండా అధికారాన్ని లెక్కచేయకుండా రాజకీయ ఒత్తిళ్ళను లెక్కచేయకుండా కేవలం నిజాయితీ మా ప్రాణం అంటూ ధర్మాన్ని రక్షించడం కోసం న్యాయాన్ని కాపాడడం కోసం చట్టపరమైన తీర్పులను ఇస్తున్నారని కల వాటి వల్ల మాత్రమే భారత రాజ్యాంగం,ప్రజాస్వామ్యం, ప్రజా సామ్రాజ్యం, తలెత్తుకుంటున్నాయని గుర్తు చేశారు.అక్రమ కేసులు తప్పుడు కేసులు భూ కబ్జా కేసులలో ఆధారాలు తారుమారు చేస్తూ నకిలీ పాత్రల చెలాయింపు కోసం ప్రయత్నం చేస్తూ కేసులు వాదిస్తున్న న్యాయవాదులు కేవలం డబ్బుల కోసం మాత్రమే ఆశపడి ఇలాంటి కేసుల వాదింపులకు అంగీకరిస్తున్నారని దానివల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోతుందన్నారు.ప్రస్తుత రోజుల్లో న్యాయస్థానాలను ఆశ్రయించే స్తోమత పేదవాళ్లు కోల్పోతున్నారన్నారు. మూడవదిగా ప్రభుత్వ వ్యవస్థలలో ప్రభుత్వ సంస్థలలో నడుస్తున్నటువంటి విచారణ కేసులు చూడముచ్చటగా హీనంగా ఆత్మాభిమానం చంపుకొని నడుపుతున్నట్లుగా కనిపిస్తున్నాయన్నారు.పలు విధాల తప్పులకు పలువిధాల అక్రమాలకు పలు విధాల అవినీతిలకు పలువిదాల మోసాలకు పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులపై విచారణ కమిటీలు వేస్తూ లోలోపల రహస్య ఒప్పందాలతో పెద్ద ఎత్తున డబ్బులను ఆశిస్తూ కమిటీల విచారణలను కేసుల పురోగతిలను ఎక్కడికక్కడ మూసివేస్తూ అవినీతికి పాల్పడుతున్న, అక్రమాలకు పాల్పడుతున్న, మోసాలకు పాల్పడుతున్న అధికారులను ప్రభుత్వ ఉద్యోగులను కాపాడడం కోసం ప్రభుత్వ యంత్రాంగాల్లో ప్రభుత్వ సంస్థలలో విధుల్లో ఉంటున్న ఉన్నత స్థాయి అధికారులు లాలూచీకి పాల్పడుతున్నారని ప్రభుత్వ వ్యవస్థలపై ఊహించరాని విమర్శలు వస్తున్నాయన్నారు.మొత్తం మీదగా అధికారిక సంపాదనలో ఆరితేరిపోతున్న మోసగాళ్లంతా ఉన్నత స్థాయి అధికారులుగా కొనసాగుతున్నంత కాలం ప్రభుత్వ వ్యవస్థలన్నీ నిర్వీర్యం అవడంతో పాటు నాశనమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ అధికారులు ప్రతిపక్ష నాయకుల పై ప్రజలపై సామాన్యులపై జర్నలిస్టులపై కడుతున్న అక్రమ కేసులు ఎంతటి వేధింపులకు గురి చేస్తున్నాయో అర్థం చేసుకోకుండా రాజకీయ నాయకుల చెప్పుచేతుల్లో కేసులు కట్టి విచారణ పేరుమీద విసిగిస్తూ వేధిస్తున్నంత కాలం రాజకీయ నాయకుల నిజాయితీ బజారున పడ్డ బరిదెగింపు తనంలాగా మారిపోతుందన్నారు.రాజకీయ అవసరాల కోసం మాత్రమే విసిగిస్తూ కేసుల విచారణను కాలయాపన చేస్తుండడం అక్రమ కేసులను కొట్టివేయాల్సిన అధికారులు అవే సక్రమమని విసిగించి విసిగించి ఇబ్బందులకు గురిచేస్తుండడం పనికిరాని రాజకీయాలకు పెంచి పోషించడంలో ప్రధాన కారణం లాంటివన్నారు.దమ్మున్నోళ్లు ముందుండి పోరాటాలు చేస్తుంటే దద్దమ్మలు వెనుకపోటు పొడుస్తూ కేసుల్లో ఇరికిస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పార్టీలతో సంబంధం లేకుండా ప్రజా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు యుద్ధం చేయాలని పిలుపునిస్తూ నాయకుల అసమర్థత పాలన వలన పేద ప్రజల జీవితాలు హీనమైపోతున్నాయన్నారు. ఏ వ్యవస్థలో చూసిన నచ్చిన వాళ్ల కేసులకు ఒక రకమైన విచారణ నచ్చని వాళ్ళ కేసులకు మరో రకమైన విచారంలతో న్యాయం తార్మారైపోతూ అబద్ధం ఆదర్శవంతమైపోతూ క్రిమినల్ కేసులు మూసివేయబడుతూ ప్రభుత్వ యంత్రాంగాలు పతనమైపోతున్నాయని ప్రస్తుతం ప్రజాస్వామ్యంలో వీటినే అభివృద్ధి ఫలాలుగా రాజకీయ నాయకులు ప్రచారాలు చేసుకుంటుండడం ఎంత సిగ్గుమాలిన చర్యలో ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు.

## మావోయిస్టు నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తా

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చన్న ముఖ్యమంత్రి**
**చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేస్తుందని వ్యాఖ్య**
**ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ పట్టుకుంటే నడవదని మాజీ మావోయిస్టు కీలక వ్యాఖ్య**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మావోయిస్టు మాజీ అగ్ర నాయకులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సచివాలయంలో సమావేశమైన విషయం తెలిసిందే. భేటీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చని తెలిపారు. చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం మాజీ మావోయిస్టు దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రివార్డు పాలసీని కోటి రూపాయలకు పెంచాలని ఆయన కోరారు. తమకు ఐదెకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. భూమి సాధ్యం కాదని ముఖ్యమంత్రి చెప్పారని, కానీ ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తే జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలిసి, ఆ తర్వాత లొంగుబాట్లపై అందరం కలిసి ప్రజలకు బహిరంగ లేఖ రాస్తామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ సిద్ధాంతం నడవదని ప్రజలకు వివరిస్తామని అన్నారు.

## చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సౌందరరాజన్ మరణం విచారకరం: సీఎం చంద్రబాబు

**చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు ఎంవీ సౌందరరాజన్ కన్నుమూత**
**ఆయన మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర సంతాపం**
**ఆలయాల సంప్రదాయాలను కాపాడేందుకు సౌందరరాజన్ జీవితాంతం కృషి చేశారని కితాబు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



హైదరాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిలుకూరు బాలాజీ ఆలయ వంశపారంపర్య ప్రధాన అర్చకుడు ఎం.వి. సౌందరరాజన్ (90) మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆలయాల సంప్రదాయాలను, వాటి స్వతంత్రతను కాపాడేందుకు సౌందరరాజన్ జీవితాంతం కృషి చేశారని, ఆయన అందించిన ఆధ్యాత్మిక సేవలు చిరస్మరణీయమని చంద్రబాబు కొనియాడారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్యంతో బాధపడుతున్న సౌందరరాజన్, హైదరాబాద్ శివారు చిలుకూరులోని తన నివాసంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆధ్యాత్మికవేత్తగానే కాకుండా, ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా, రిజిస్ట్రార్‌గా కూడా సేవలు అందించి విద్యావేత్తగా చెరగని ముద్ర వేశారు. ప్రభుత్వ నియంత్రణను వ్యతిరేకిస్తూ ఆలయాల స్వయంప్రతిపత్తి కోసం ఆయన చేసిన పోరాటం తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇందులో భాగంగా 1998లో చిలుకూరు ఆలయంలో హుండీని తొలగించి సంచలనం సృష్టించారు. "సౌందరరాజన్ మరణం విచారకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని చంద్రబాబు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. సౌందరరాజన్ కుమారుడు సీఎస్ రంగరాజన్ ప్రస్తుతం చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్నారు.

## హైదరాబాద్ హోటళ్లలో కల్తీ నెయ్యి కలకలం!

**హైదరాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌లో కల్తీ నెయ్యి వాడినట్లుగా రిపోర్టు**
**జీహెచ్ఎంసీ సేకరించిన నమూనాలు అసురక్షితమని ల్యాబ్ రిపోర్ట్**
**ల్యాబ్ రిపోర్ట్‌ను సవాలు చేసిన నెయ్యి తయారీ సంస్థ**
**మరోసారి పరీక్షల కోసం నమూనాలను మైసూర్ పంపిన అధికారులు**

హైదరాబాద్, జై భీమ్ న్యూస్



హైదరాబాద్ నగరంలోని ఆహార ప్రియులకు షాక్ తగిలేలా, ప్రముఖ ప్యారడైజ్ హోటల్‌లో కల్తీ నెయ్యి వాడుతున్నట్లు వార్తలు కలకలం రేపుతున్నాయి. గత నెల రోజుల వ్యవధిలో నగరంలో కల్తీ నెయ్యికి సంబంధించి ఇది మూడో ఘటన కావడం గమనార్హం. మార్కెట్ లో నెయ్యికి ఉన్న డిమాండ్ నేపథ్యంలో కొన్ని సంస్థలు రసాయనాలు, కూర నూనెలతో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సాధారణ తనిఖీల్లో భాగంగా జీహెచ్ఎంసీ అధికారులు ఖైరతాబాద్ జోన్‌లోని ఐమాక్స్ వద్ద ఉన్న ప్యారడైజ్ హోటల్‌లో, మరో రెండు చోట్ల తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లో వాడుతున్న 'సుధీర్ ఇండస్ట్రీస్' బ్రాండ్‌కు చెందిన నెయ్యి నమూనాలను సేకరించి, నాచారంలోని రాష్ట్ర ఆహార భద్రత ప్రయోగశాలకు పంపించారు. అక్కడ జరిపిన పరీక్షల్లో ఆ నెయ్యి తినడానికి సురక్షితం కాదని (అన్‌సేఫ్) తేలినట్లు సమాచారం. అయితే, ప్రభుత్వ ల్యాబ్ ఇచ్చిన రిపోర్టును నెయ్యి తయారీ సంస్థ సవాలు చేసింది. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమించారు. ఆ నమూనాలను మరోసారి పరీక్షించేందుకు మైసూర్‌లోని కేంద్ర ప్రభుత్వ ప్రయోగశాలకు పంపినట్లు తెలిసింది. మైసూర్ ల్యాబ్ నివేదికలో కూడా నెయ్యి కల్తీ అని, ప్రమాదకరమని తేలితే తయారీ సంస్థపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం మైసూర్ నుంచి రాబోయే తుది నివేదిక కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

## వాస్తవాలు ఒప్పుకో... నేను కాదు మీ అహంకారమే ఓటమికి కారణం: కేటీఆర్‌కు కవిత కౌంటర్

**మద్యం కుంభకోణం కారణంగా బీఆర్ఎస్ ఓడిపోయిందని అభిప్రాయపడిన కేటీఆర్**
**ఓటమికి నేను కారణమా బీఆర్ఎస్ నేతలు చెప్పాలని కవిత సవాల్**
**ప్రజలకు ఇళ్లు, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, దోపిడీదారులకు టిక్కెట్లు ఇవ్వడం ఓటమికి కారణమని వెల్లడి**
**మీ అహంకార ధోరణి ఓటమికి కారణమని కవిత వ్యాఖ్య**



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

వాస్తవాలు ఒప్పుకో అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు క్లీన్ చిట్ ఇస్తూ వచ్చిన తీర్పుపై కేటీఆర్ స్పందించారు. మద్యం కుంభకోణం పేరుతో ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చివేశారని, తెలంగాణలో ఆ కారణంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈరోజు కవితకు అనుకూలంగా వచ్చిన తీర్పుతో న్యాయం జరిగిందని అన్నారు. మద్యం కుంభకోణం కారణంగానే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయంపాలైందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోదరుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టును చూశానని, తనపై పెట్టిన కేసు వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నట్లుగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలను నేను సూటిగా ప్రశ్నిస్తున్నానని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి నేనే కారణమా సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రజలకు ఇళ్లు, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, అభ్యర్థులను మార్చకుండా దోపిడీదారులకే తిరిగి టిక్కెట్లు ఇవ్వడం, అన్నింటికంటే ముఖ్యంగా మీ అహంకార ధోరణి ఓటమికి కారణమని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈరోజు కోర్టు తీర్పును మీకు అనుకూలంగా మార్చుకుని మాట్లాడటం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ ఓటమిని నా మెడలో వేయాలని చూస్తున్నారని, ఇది సరైనపద్ధతి కాదని అన్నారు. ఇప్పటికైనా మీరు ప్రజల తీర్పును గౌరవించాలని కేటీఆర్‌కు సూచించారు.

## కాకతీయ యూనివర్సిటీ వద్ద ప్రధాని చిత్రపటం దహనం

**ఉదయభాను చిబ్ విడుదల చేయాలని యువజన కాంగ్రెస్ ఆందోళన**




హన్మకొండ, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపు మేరకు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కార్తీక్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని దహనం చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అల్వాల కార్తీక్ మాట్లాడుతూ, యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయభాను చిబ్బు అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై గళమెత్తుతున్న నాయకుడిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం యువజన కాంగ్రెస్ నాయకత్వంపై కక్షసాధింపుగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, వెంటనే విడుదల చేయకపోతే దేశవ్యాప్తంగా బీజేపీ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడికి దిగుతామని హెచ్చరించారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలని కూడా డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌరం రాహుల్ వర్ధన్, డివిజన్ నాయకులు జూని ఆజాద్ సింగ్, వినయ్ కుమార్, వివేక్ తదితరులతో పాటు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు గాద వివేక్, లక్కీ, ఖుర్షీద్, హరి సింగ్, అప్సర్, దామెర మింటూ, వివేక్ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

వేములవాడ, ఫిబ్రవరి 27( జై భీమ్ న్యూస్)



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కనీస వసతుల కల్పనను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. పరిశీలనలో తహసీల్దార్ జయంత్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

# చిన్నారి హత్యపై ఆదారాలు మాయం ?





**కుమ్మెర సంఘటనకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలి**

**అబద్ధాలకు అన్నిరకాల సహకారాలు లభిస్తున్నాయి**

**పోస్ట్ మార్టం నివేదికలు ఎంతా సునాయాసంగా మారిపోతున్నాయి**

**దోషులను కఠినంగా శిక్షించాలి**

**కేయూ రజక విద్యార్థి సంఘం ఇంచార్జ్ కోరపల్లి రాజేష్**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

శుక్రవారం రాత్రి కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద తెలంగాణ రజక విద్యార్థి సంఘం కోరపల్లి రాజేష్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర మల్లికార్జున స్వామి జాతరలో జరిగిన దారుణ సంఘటనలో మృతి చెందిన 2 నెలల పసి పాప ఆత్మకి శాంతి చేకూరాలని కేయూ రజక విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో క్రొవ్వత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా తెలంగాణ రజక విద్యార్థి సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ కత్తెరపల్లి దామోదర్ ఘాటుగా స్పందించారు. జాతర అనేది భక్తి, ఐక్యత, సమానత్వానికి ప్రతీక కావాలని, కానీ అక్కడ కుల వివక్షతకు చోటు కల్పించడం అత్యంత సిగ్గుమాలిన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులను కులాల పేరుతో వేరు చేయడం రాజ్యాంగ విరుద్ధమని, ఇది సమాజానికి తప్పు సందేశం ఇస్తుందని అన్నారు. ఇలాంటి సంఘటనలు తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కుల వివక్షతకు ఈ దేశంలో ఎలాంటి స్థానం లేదని, ప్రతి ఒక్కరూ సమానులనే భావనను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదీ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కత్తెరపల్లి దామోదర్ స్పష్టం చేశారు. అదేవిదంగా కేయూ రజక విద్యార్థి సంఘం ఇంచార్జీ కోరేపల్లి రాజేష్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



# తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులకు హార్వర్డ్ యూనివర్సిటీ నిపుణులతో ఎగ్జిక్యూటివ్ శిక్షణ

**సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు అంతర్జాతీయ స్థాయి ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు అందించేందుకు హార్వర్డ్ యూనివర్సిటీతో త్వరలో అవగాహన ఒప్పందం (వీశీఖ) కుదుర్చుకోనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (వీజ=ఎ=ణ×)లో హార్వర్డ్ నిపుణులు ఎగ్జిక్యూటివ్ క్లాసులు నిర్వహించే విధంగా ఈ ఒప్పందం జరగనుంది. హార్వర్డ్ యూనివర్సిటీ సూత్రప్రాయంగా అంగీకరించిందని సీఎం తెలిపారు. గ్రూప్ I (271 మంది), గ్రూప్ II (175 మంది) ఉద్యోగాలకు ఎంపికైన అధికారులు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫౌండేషన్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన వాలెడిక్టరీ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న విషయాలు, ఫీల్డ్ విజిట్‌ల సందర్భంగా తెలుసుకున్న అంశాలపై అభ్యర్థులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సీఎం పరిశీలించారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులందరికీ అభినందనలు తెలియజేశారు. ఁసభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి గారు, “విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయండి. ఎస్.ఆర్. శంకరన్ గారిని గుర్తుపెట్టుకోండి. పేదవారికి సహాయం చేసేప్పుడు తల్లిదండ్రులను గుర్తుపెట్టుకోండి. మంచి పని చేయడానికి విచక్షణ, అధికారం ఉంటే సరిపోతుంది. ప్రభుత్వంలో ప్రొసీజర్స్, ప్రాక్టీసెస్ ఉంటాయి. అర్థం కానప్పుడు కామన్ సెన్స్ పెద్ద అసెట్. చట్టాలు, నియమాలు పని చేయకుండా ఆపడానికి కాదు. పది మందికి సహాయం చేయడానికి ముందుకు వెళ్లాలి. మొన్న విద్యార్థులు, నిన్న నిరుద్యోగులు, ఈనాడు తెలంగాణ ప్రభుత్వంలో అధికారులు. 4 కోట్ల ప్రజలకు ప్రజా పాలన అందించడానికి ఈ శిక్షణను వినియోగించండి. తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని స్వీకరించరు. దశాబ్దాల త్యాగాల స్ఫూర్తితో ముందుకు వెళ్లండి. 2011 తర్వాత గ్రూప్ 1 నిర్వహించలేకపోయిన పరిస్థితుల్లో మా ప్రభుత్వం ూాజను ప్రక్షాళన చేసి పరీక్షలు నిర్వహించింది. కొందరు కుట్రలు పన్ని న్యాయస్థానాలకు వెళ్లారు. మీ మెరిట్‌ను గుర్తించి ప్రభుత్వం మీ పక్షాన నిలబడింది. అధికారిగా 30-35 సంవత్సరాల నిబద్ధత అవసరం. మీ చొరవ పథకాలను ప్రజలకు చేరువ చేస్తుంది. మీరే ప్రభుత్వ కళ్లు, చెవులు. చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. తల్లిదండ్రులను బాగా చూసుకోండి. చూసుకోని వారి జీతాల్లో కొంత కోత పెట్టి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసే చట్టం అసెంబ్లీలో చేస్తాం” అని సీఎం రేవంత్ రెడ్డి గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ అధికారుల నాణ్యత, పరిపాలనా సామర్థ్యాలను మరింత పెంచడానికి మైలురాయిగా నిలవనుందని అధికార వర్గాలు తెలిపాయి.




# అక్రిడిటేషన్ కార్డుల గడువు రెండు నెలలు పొడిగింపు

**హైద్రాబాద్, 27 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ప్రభుత్వం ఊరట కలిగించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో రెండు నెలలు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సమాచారం, ప్రజాసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న జర్నలిస్టులకు జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు 28 ఫిబ్రవరి 2026తో ముగియనుంది. అయితే జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీల (డిఎంఎసి) ఏర్పాటు ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. అలాగే రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఎస్ఎంఎసి), జిల్లా కమిటీల సమావేశాలు నిర్వహించడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో, జర్నలిస్టులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. దీననుసారం 1 మార్చి 2026 నుంచి 30 ఏప్రిల్ 2026 వరకు ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు చెల్లుబాటు అయ్యేలా ఉత్తర్వులు జారీ చేయబడినట్లు అధికారులు తెలిపారు. ఈ పొడిగింపు రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టులందరికీ వర్తించనుంది. సంబంధిత జిల్లా కలెక్టర్లు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్లు తగిన చర్యలు తీసుకోవాలని సమాచారం మరియు ప్రజాసంబంధాల శాఖ సూచించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది జర్నలిస్టులకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. కొత్త కమిటీల ఏర్పాటు పూర్తయ్యే వరకు పాత కార్డులు చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం స్పష్టంచేసింది.



GOVERNMENT OF TELANGANA
INFORMATION AND PUBLIC RELATIONS DEPARTMENT :: HYDERABAD

From,
The Spl. Commissioner,
Information & Public Relations Dept.,
A.C. Guards, Hyderabad.

To,
All the DMAC Chairmen &
District Collectors,
Telangana State.

**Letter No. 003491/MR/2024, date:24.02.2026.**

Sir,

Sub:- I&PR Dept., - Media Relations Section – Extension of the validity period of the existing State and District Journalists accreditation cards for a period of (2) months i.e from 01.03.2026 to 30.04.2026– Reg.

Ref: Memo No.6653 /I&PR/2026, dt. 24.02.2026 from the E.O. Special Secretary to Government.

***

I am to inform that the validity of accreditation cards issued to the working journalists is going to expire on 28.02.2026.

The constitution of District Media Accreditation Committees are still pending. Conducting SMAC / DMAC meetings may take time. In the meantime to avoid inconvenience for the working journalists, the validity of accreditation cards is being extended for a period of (2) months i.e. from 01.03.2026 to 30.04.2026.

Therefore, I request you to extend the validity period of the existing district journalist accreditation cards from 01.03.2026 for a period of (2) months i.e. upto 30.04.2026.

Yours Faithfully
Sd/- CH. Priyanka
Spl. Commissioner

Copy to
The Chairman, Media Academy of Telangana State.
The Regional Joint Director, Multi Zone-I & Multi Zone-II.
All the DPRO's in the State for information and necessary action.

// F.B.O. //

Addl. Director (FAC)

# మొబైల్‌లో సిమ్ లేకపోతే.. వాట్సాప్ పనిచేయదు..

**ఎల్లుండి నుంచి కొత్త రూల్ అమలు**




**(ఇండియా జై భీమ్ న్యూస్)**

మెసేజింగ్ యాప్ వాట్సాప్‌పై కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఈ నెల 28వ తేదీ తర్వాత సిమ్ లేకుండా వాట్సాప్ పనిచేయదు. వాట్సాప్ వాడాలంటే సిమ్ తప్పనిసరిగా ఉండాలంటూ జారీచేసిన 'సిమ్ అనివార్యం' నిబంధనకు ఫిబ్రవరి 28 డెడ్‌లైన్‌గా కేంద్రం గతంలో ప్రకటించింది. ఈ డెడ్‌లైన్‌ను పొడిగించబోమని కేంద్రం స్పష్టంచేసింది. జాతీయ భద్రతకు, సైబర్ నేరగాళ్ల నుంచి యూజర్లను కాపాడేందుకే వీటిని అమలులోకి తెస్తున్నట్టు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్, స్నాప్‌చాట్, షేర్‌చాట్, జియోచాట్, అరాటై, జోష్ లాంటి సామాజిక మాధ్యమాల వినియోగానికి మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా సిమ్ ఉండాల్సిందే.

# తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పణ




**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్ర విద్యా విధానంలో సమగ్ర సంస్కరణలు తీసుకురావడానికి ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి గారితో పాటు కమిషన్ సభ్యులు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారికి విస్తృత నివేదికను సమర్పించారు. కమిషన్ సభ్యులు అమెరికా, వియత్నాం, మలేసియా వంటి దేశాల్లో స్వయంగా పర్యటించి, వివిధ దేశాలు మరియు రాష్ట్రాల్లోని అత్యుత్తమ విద్యా విధానాలను అధ్యయనం చేసి ఈ నివేదికను రూపొందించారు. సమావేశంలో నివేదికలోని ముఖ్య అంశాలను వివరంగా తెలియజేశారు. ముఖ్యమంత్రి గారు నివేదికను ఆసక్తిగా పరిశీలించి, పలు కీలక సూచనలు చేశారు. నివేదికలోని కొన్ని ముఖ్యమైన అంశాలను చట్టబద్ధం చేయడం, వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచి అమలు చేయడం వంటి విషయాలపై వివరణాత్మక నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ బాధ్యతను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు గారి నేతృత్వంలోని కమిటీకి అప్పగించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ కె. కేశవరావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తదితర విద్యా కమిషన్ సభ్యులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నివేదిక తెలంగాణ విద్యా రంగంలో నాణ్యతా మెరుగుదల, సమగ్ర సంస్కరణలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విధాన మార్పులు తీసుకురావడానికి మార్గదర్శకంగా నిలవనుందని అధికార వర్గాలు తెలిపాయి.

## వికారాబాద్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల శిక్షణ శిబిరం

**పార్టీ సిద్ధాంతాలు, పూర్వ వైభవంపై అయూబ్ ప్రసంగం**

**వికారాబాద్, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



వికారాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ–-ఆంధ్రప్రదేశ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ కీలక ప్రసంగం చేశారు. పార్టీ నిర్మాణం బలోపేతం, సిద్ధాంత పరమైన దృఢత్వం, సామాజిక న్యాయం అంశాలపై ఆయన విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు దేశ నిర్మాణంలో పోషించిన పాత్రను వివరించిన అయూబ్, దళితులు, గిరిజనులు, మైనార్టీలు, ఇతర అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ చేసిన సేవలను గుర్తు చేశారు. సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజాస్వామ్య బలోపేతం కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలని తెలిపారు. పార్టీ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావాలంటే గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కేడర్‌ను బలోపేతం చేయాలని, యువతను ఆకర్షించే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ పార్టీని మరింత ప్రజలకు చేరువ చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ శిబిరంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొని సంస్థాగత బలోపేతంపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాల సాధన సాధ్యం





**సెయింట్ మేరీస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుకలు ఘనంగా ముఖ్య అతిథిగా సీఐ చేరాలు**

**హసన్‌పర్తి, 27 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండల కేంద్రంలోని సె. మేరీ'స్ హై స్కూల్ హసన్‌పర్తిలో శుక్రవారం నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు (ఫేర్‌వెల్) వేడుకలు భావోద్వేగపూరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. విద్యార్థుల భవిష్యత్ విజయాల కోసం శుభాకాంక్షల మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక సీఐ వట్టే చేరాలు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా సీఐ చేరాలు మాట్లాడుతూ విద్యార్థి దశ జీవిత నిర్మాణానికి పునాది వంటిదని, ఈ దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో, కష్టపడి సాధన చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. పదవ తరగతి బోర్డు పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు అని, ఇది భవిష్యత్ విద్యా ప్రస్థానానికి మొదటి మెట్టు అని తెలిపారు. ప్రతి విద్యార్థి తన గమ్యాన్ని స్పష్టంగా నిర్ధారించుకుని ప్రతిరోజూ క్రమబద్ధంగా శ్రమిస్తేనే విజయం సాధ్యమవుతుందని సూచించారు. విజయానికి ఎలాంటి షార్ట్‌కట్స్ ఉండవని, తాత్కాలిక లాభాల కోసం తీసుకునే మార్గాలు దీర్ఘకాలిక లక్ష్యాలను నెరవేర్చవని ఆయన స్పష్టం చేశారు. కష్టపడి సంపాదించిన విజయమే జీవితాంతం నిలిచే సంపద అని అన్నారు. సెయింట్ మేరీస్ పాఠశాల గత 32 సంవత్సరాలుగా నాణ్యమైన విద్య అందిస్తూ అనేకమంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చడం గర్వకారణమని అభినందించారు. అదేవిధంగా విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని, సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ అంశాలపై తమ తల్లిదండ్రులు, బంధువులు, పరిసర ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అకాడమిక్ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఐ చేరాలు మెడల్స్ అందజేసి అభినందించారు. విద్యార్థుల వీడ్కోలు సందర్భంగా ఉపాధ్యాయులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమలేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సదానందం, కల్పనా రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రశేఖర్ ఆజాద్ 95వ వర్ధంతి సందర్భంగా పి.డి.ఎస్.యు నివాళులు




**హన్మకొండ, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

భారత జాతీయోద్యమ విప్లవ వీరుడు చంద్రశేఖర్ అజాద్ 95వ వర్ధంతి సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా నివాళులు అర్పించారు. కేయూ లైబ్రరీ ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థి నాయకులు స్మరించారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు కేయూ అధ్యక్షుడు బి. బాలకృష్ణ, తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కో-కన్వీనర్ పి. అనూష మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహావీరుడు చంద్రశేఖర్ ఆజాద్ 1931 ఫిబ్రవరి 27న త్యాగం చేసి అమరుడయ్యారని గుర్తుచేశారు. దేశభక్తి, త్యాగం, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఆజాద్ జీవితం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆజాద్ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, కుల--మత--ఆర్థిక అసమానతలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యారంగ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని, పీహెచ్‌డీ విద్యార్థులందరికీ ఫెలోషిప్‌లు మంజూరు చేయాలని, విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు హర్షిత, అరుణ్, నవీన్, చందు, అక్షయ, హరి చందన, పృథ్వి, నాగరాజు, వివేక్, ధనలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ నూతన కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ భద్రకాళీ అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు

**పూర్ణకుంభ స్వాగతం - జిల్లా శాంతి, అభివృద్ధి కోసం ప్రార్థనలు**





**వరంగల్, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని చారిత్రక క్షేత్రం శ్రీ భద్రకాళి టెంపుల్ ను హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహట్ బాజ్పాయ్ శుక్రవారం ఉదయం సందర్శించి శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి పూజా కార్యక్రమంగా అమ్మవారిని దర్శించుకోవడం విశేషంగా నిలిచింది. ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ధర్మకర్త బింగి సతీష్ సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా వేదమంత్రాల మధ్య స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గోశాలలో గోవులకు గ్రాసం పెట్టిన కలెక్టర్ గారు, అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఆదిశంకరాచార్యుల విగ్రహం, వల్లభ గణపతిని దర్శించుకున్నారు. తర్వాత ఆలయ ప్రదక్షిణ చేసి గర్భగుడిలో ప్రవేశించి శ్రీ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. పూజానంతరం ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా శాంతి, అభివృద్ధి, ప్రజల సౌభాగ్యాల కోసం కలెక్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రమేష్ రాథోడ్, తహశీల్దార్ రవీందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు.

## మహిళా శిశు సంక్షేమంలో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**పోషకాహార లోపాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు**
**రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు సన్నాహాలు**
**త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీం**
**సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క**



**(హైదరాబాద్ జై భీమ్ న్యూస్)**

మధుర్‌నగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖపై జిల్లా డీడబ్ల్యూఓలతో మంత్రి సీతక్క సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీజీ ఫుడ్స్ చైర్మన్ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, టీజీ ఫుడ్స్ ఎండి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో బడ్జెట్ కేటాయింపులు, చేసిన ఖర్చులు, అమలవుతున్న పథకాలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేయబోయే పథకాలు, అంగన్వాడి భవనాల నిర్మాణము, అంగన్వాడి కేంద్రాలకు ఉచిత విద్య సరఫరా, అంగన్వాడీ కేంద్రాల కు హాజరు శాతం, ప్రీస్కూల్ యాక్టివిటీ, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. 2199 అంగన్వాడి భవనాలు మంజూరు చేస్తే ఇప్పటివరకు కేవలం 500 భవనాలే పూర్తయ్యాయని.. మిగిలిన భవనాలను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా లోపం లేదా నిర్లక్ష్యం జరిగినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సాక్ష్యం అంగన్వాడి కింద రాష్ట్రంలోని ఆంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, పరిశుభ్రమైన, సానుకూల వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. "మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'అమ్మ మాట అంగన్వాడి బాట' అనే నినాదంతో కార్యక్రమాలు ప్రారంభించాం. దీని ఫలితంగా అంగన్వాడి కేంద్రాలకు చిన్నారుల హాజరు శాతం గణనీయంగా పెరిగింది" అని పేర్కొన్నారు. తెలంగాణను పోషక లోప రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రత్యేక పోషకాహార కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమును ప్రారంభిస్తామని తెలిపారు. ములుగు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద అంగన్వాడి చిన్నారులకు రోజుకు 100 ఎంఎల్ విజయ పాలు సరఫరా చేస్తున్నామని చెప్పారు. కౌమార బాలికల్లో రక్తహీనత తగ్గించేందుకు ఆదివాసీలు అధికంగా ఉన్న మూడు జిల్లాల్లో పల్లి, చిరుధాన్యాల చిక్కిలను అందిస్తున్నామని తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలు సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అంశంపై సమగ్ర నివేదికను అధికారులు సమర్పించాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలు లేనిచోట, మొబైల్ అంగన్వాడి సేవలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. మిషన్ వాత్సల్య కింద బాలల రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, మిషన్ శక్తి ద్వారా మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. అమ్మాయిల భద్రత విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. జిల్లాల వారీగా ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతున్నాయని, వాటి వేగాన్ని మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. మహిళల గౌరవం, పిల్లల ఆరోగ్యం, భద్రత, విద్యలపై ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. తెలంగాణను మహిళలు, పిల్లల సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

## వేములవాడ భీమన్న ఆలయం లడ్డూల కేంద్రం వద్ద ఇష్టారాజ్యంగా ప్రైవేటు వ్యక్తుల క్యారీ బ్యాగ్స్ విక్రయాలు

**భీమన్న ఆలయానికి భారీగా గండి**
**పట్టించుకోని ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది**
**క్యారీ బ్యాగ్స్ ను దేవస్థానం తరపున ముద్రించి, శాశ్వత పూజల వివరాలు ప్రింట్ చేయించి భక్తులకు అమ్మాలని విజ్ఞప్తి**



**వేములవాడ 27 ఫిబ్రవరి2026 (జై భీమ్ న్యూస్)**

వేములవాడ లో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం ముందు ఉన్న లడ్డు కౌంటర్ వద్ద కొంతమంది మహిళలు దర్జాగా, కొంతమంది షాపింగ్ మాల్ లో పని చేసుకుంటూ ఖాళీ సమయంలో భక్తులకు క్యారీ బ్యాగ్స్ విక్రయించుకుంటూ డబ్బులు దండుకుంటున్నారు. అలాగే ఆలయం ముందు భిక్షాటన చేసేవాళ్లు దాదాపు పదిమందికి పైగా క్యారీ బ్యాగులు విక్రయిస్తూ సొమ్ము చేసుకోవడం పలు విమర్శలకు తావిస్తుంది. శ్రీ భీమేశ్వరాలయానికి వచ్చే వేలాది మంది భక్తులు ప్రసాదాలు కొనుక్కొని వెళ్తున్న సమయంలో ప్రైవేట్ వ్యక్తులు ఇష్టాను రీతిగా పది రూపాయలకు ఒక్క క్యారీ బ్యాగ్ చొప్పున అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. క్యారీ బ్యాగుల ప్రైవేట్ వ్యక్తుల విక్రయాలను నియంత్రించవలసిన ఆలయ చేతులు అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, పట్టించుకోకుండా దులిపేసుకుంటున్నారు. క్యారీ బ్యాగ్స్ అమ్ముకునే మహిళలు మమ్మల్ని ఎస్పీఎఫ్ సిబ్బంది అమ్ముకొమ్మన్నారని బాహాటంగా చెబుతూ వాళ్లకు ఎంతో కొంత ముడుపులు అప్పజెప్పుతున్నారని భక్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు క్యారీ బ్యాగ్స్ విక్రయించుకుంటూ భక్తులను నిలువు దోపిడి చేస్తున్న ఆలయ అధికారులు కానీ, ఎస్పీఎఫ్ సిబ్బంది గాని నిర్లక్ష్యం వహించడం వెనుక మతలబు ఉంది అని భక్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా భీమన్న ఆలయ అధికారులు నిద్రలేచి భీమేశ్వర స్వామి ఫోటోలను క్యారీ బ్యాగులపై ముద్రించి, దేవస్థానంలో జరిగే వివిధ రకాల పూజల వివరాలు తెలిసే విధంగా క్యారీ బ్యాగులపై ముద్రించాలని, లడ్డు కౌంటర్లో టికెట్లు విక్రయించే చోటనే దేవస్థానం అధికారులు అధికారికంగా క్యారీ బ్యాగులను విక్రయించాలని, తద్వారా ఆలయానికి ఆదాయం సమకురుతుందని భీమన్న భక్తులు పేర్కొంటున్నారు.






## జాతీయ స్థాయిలో ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ సాధించిన జయగిరి విద్యార్థిని జనగాని శ్రీజ

**హసన్ పర్తి, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జయగిరి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని జనగాని శ్రీజ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మేన్స్ - కమ్ - మెరిట్ స్కాలర్షిప్) టాలెంట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై గ్రామానికి కీర్తి తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిభావంతులైన మరియు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక పరీక్షలో శ్రీజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో నిలిచింది. ఆమె సాధించిన విజయం పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలకు గర్వకారణంగా మారింది. శ్రీజ విజయానికి పాఠశాల ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం, ఆమె కృషి ప్రధాన కారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.



# వరంగల్‌లో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపై ఎంపీ కడియం కావ్య సమీక్ష





**వరంగల్, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలో నిర్మాణంలో ఉన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య శుక్రవారం పరిశీలించారు. ఆమెతో పాటు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద కూడా పాల్గొన్నారు. పరిశీలన అనంతరం ఆసుపత్రి అభివృద్ధి పనులపై ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్, ఎల్ ఉ టీ, ఆర్ ఉ బీ, విద్యుత్ శాఖ, జీడబ్ల్యూఎంసీ, ఫైర్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్మాణ పురోగతిపై అధికారులు వివరాలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టారని పేర్కొన్నారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తూ రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. 24 అంతస్తుల ఈ భవనంలో ఎమర్జెన్సీ సేవలు, బెడ్లకు ఆక్సిజన్ లైన్లు, ఫైర్ సేఫ్టీ వ్యవస్థ, సెంట్రల్ ఏసీ, విద్యుత్ సరఫరా, నీటి పైప్‌లైన్ కనెక్షన్లు, క్యాన్సర్ విభాగానికి రేడియేషన్ థెరపీ బంకర్లు, ఓపీ, ఐపీ విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు తదితర విభాగాల పనులను ఎంపీ, కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఉత్తర తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ స్థాయి వైద్య సేవలను వరంగల్‌లోనే అందించాలనే లక్ష్యంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోందని, త్వరలోనే వైద్య సేవలు ప్రారంభం కానున్నాయని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ హరీష్ చంద్ర రెడ్డి, ఆర్ఎంఓ డా. రఘునాధస్వామి, డా. మధుకర్ యాదవ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కు టీఎన్జీఓఎస్ అభినందనలు



**హన్మకొండ, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చాహత్ బాజ్ పాయ్ ను తెలంగాణ ఎన్‌జీవోల సంఘం (టీఎన్జీఓస్) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, హనుమకొండ జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు కలెక్టర్ ఛాంబర్‌లో కలుసుకుని మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో పరిపాలన మరింత పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చేపట్టే చర్యలకు తమ పూర్తి సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికిల రాజేష్, గౌరవాధ్యక్షుడు శ్యాంసుందర్‌తో పాటు కేంద్ర నేతలు రాము నాయక్, సారంగపాణి, లక్ష్మీప్రసాద్, సర్వర్ హుస్సేన్, గోవర్ధన్ పాల్గొన్నారు. అలాగే జిల్లా నేతలు సలీం, రాజమౌళి, రాజేష్ ఖన్నా, రాజేశ్వర్ రెడ్డి, భగవాన్ రెడ్డి, సాంబయ్య, అనుప్, ప్రణయ్, పృధ్వి, రమేష్, నిఖిల్, అశోక్, వెంకన్న, సింధు, సరస్వతి, కళ్యాణి, నాగరాణి, భాగ్యలక్ష్మి, రజిత, రమేష్, భరత్ తదితరులు హాజరై కలెక్టర్‌కు అభినందనలు తెలియజేశారు. కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ప్రజా సేవల మెరుగుదల దిశగా అందరి సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు.

## కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగులకు కొత్త హెల్త్ కార్డులు వర్తింపజేయాలి: డా. పుల్లా శ్రీనివాస్




**హన్మకొండ, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన నూతన నగదు రహిత ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉద్యోగులకు కూడా తప్పనిసరిగా వర్తింపజేయాలని అఖిల భారత విశ్వవిద్యాలయాల ఉద్యోగుల సమాఖ్య (ఎఐయూఈసి) జాతీయ ఉపాధ్యక్షుడు డా. పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలోని టెక్నికల్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం ముందు పలు ప్రధాన డిమాండ్లు ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్న అన్ని రకాల ఆరోగ్య ప్రయోజనాలను యూనివర్సిటీల్లో పనిచేస్తున్న బోధనేతర, సాంకేతిక సిబ్బందికి ఎటువంటి మినహాయింపు లేకుండా వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేయబోయే కొత్త జీవో (జి.ఓ.)లో యూనివర్సిటీ ఉద్యోగులను ప్రత్యేకంగా చేర్చాలని, ఇందుకోసం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తమకు నమ్మకం ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం పొందడం ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని తెలిపారు. కేబినెట్ ఆమోదించిన 1,998 రకాల వైద్య చికిత్సలు, డిజిటల్ హెల్త్ కార్డుల సౌకర్యం యూనివర్సిటీ ప్రాంగణాల్లోని ప్రతి ఉద్యోగికి అందేలా చూడాలని కోరారు. "ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న మాకు ఆరోగ్య పథకాల విషయంలో వివక్ష చూపకుండా ఈ పథకాన్ని వర్తింపజేయాలి" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసోసియేషన్ కార్యదర్శి నలుబోల రాము, ఉపాధ్యక్షుడు మెట్టు రవి, కోశాధికారి ప్రేంసాగర్, వి. నందయ్య, వై. బాబు తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చుతో డివిజన్లో బోర్ వేయించిన కౌన్సిలర్ వీర రాఘవరావు

**వర్ధన్నపేట మున్సిపల్ 3వ డివిజన్‌లో కౌన్సిలర్ ముందడుగు.**





**వర్ధన్నపేట ఫిబ్రవరి 27 జై భీమ్ ప్రతినిధి:**

వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 3వ డివిజన్‌లో నెలకొన్న స్థానిక నీటి ఎద్దడిని నివారించేందుకు కౌన్సిలర్ గుజ్జ వీరరాఘవరావు స్వంత ఖర్చులతో కొత్త బోర్‌వెల్ త్రవ్వింపునకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం స్థానిక ప్రజల్లో ఆనందం నింపింది. ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు చేపట్టినట్లు కౌన్సిలర్ తెలిపారు. ప్రజలకు నిరంతర నీటి సరఫరా కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్ధన్నపేట పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్, 3వ డివిజన్ అధ్యక్షులు కొండేటి సుధాకర్, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ సిలివేరు శ్రీధర్ యాదవ్, 11వ డివిజన్ అధ్యక్షులు మైస వీరేందర్, 3వ డివిజన్ నాయకులు గబ్బేట బాబు, ఎండీ అలీమ్ తదితరులు పాల్గొన్నారు. స్థానికులు కౌన్సిలర్ చర్యను అభినందిస్తూ, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకాలని ఆకాంక్షించారు.

## డ్రైవర్ల కంటి పరీక్షలతో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందడుగు: సన్ ప్రీత్ సింగ్







**వరంగల్, 27 ఫిబ్రవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

డ్రైవర్ల కంటి చూపు సరిగా ఉంటే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం రెండవ విడతలో భాగంగా వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ములుగు రోడ్డులోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక రీజినయన్ ఐ హాస్పిటల్, శరత్ ఐ హాస్పిటల్, కీర్తి హాస్పిటల్‌ల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు నాలుగు వందలకుపైగా ఆటో డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోగా, మూడు వందలకుపైగా డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు క్షేమంగా తన గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకమని, ముఖ్యంగా వయస్సు పెరిగే కొద్దీ కంటి చూపు మందగించడం సహజమని పేర్కొన్నారు. ప్రజలను తరలించే ప్యాసింజర్ వాహనాల డ్రైవర్లు తమ కంటి ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లపై ఉందని, కంటి చూపు సమస్యలతో వాహనం నడపడం ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. కంటి చూపు బాగుంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచికలను సులభంగా గుర్తించి సురక్షితంగా డ్రైవింగ్ చేయవచ్చని తెలిపారు. అనంతరం కమిషనర్ చేతుల మీదుగా ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ట్రాఫిక్ అదనపు డిసిపి ప్రభాకర్ రావు, ఏసిపిలు సత్యనారాయణ, నర్సింహరావు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు సుజాత, సీతా రెడ్డి, వెంకన్న, మట్టెవాడ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్‌తో పాటు డాక్టర్లు శ్రీదేవి, డా. దిలిప్, రంజన్ కుమార్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**విద్యార్థులే ఉపాధ్యాయులు అయినవేళ.**
**వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం.**




**వర్ధన్నపేట ఫిబ్రవరి 27 జై భీమ్ ప్రతినిధి:**

విద్యార్థులు న్యాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడంతో పాటు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కాగితపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాద్యుయులుగా రామగిరి రాజేష్ ఖన్నా వ్యవహరించగా మండల విద్యాశాఖాధికారిగా కుదురుపాక సాత్విక్, జిల్లా విద్యాశాఖాధికారిగా కొండేటి శశి కిరణ్ వ్యవహరించారు. పదవ , తొమ్మిదవ తరగతి విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యార్థులకు పాఠాలు బోధించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయని అన్నారు. భవిషత్ లో ఒక మంచి ఉన్నత స్థానానికి ఎదుగుటకు గోల్ ఏర్పరుచుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. న్యాయ నిర్ణేతలు గా ఉపాధ్యాయులు రోహిణి దేవి, మంజు సుప్రియ , నర్సింగ రావు లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రమణా రావు, అశోక్, కుమార స్వామి, మనుజేందర్ రెడ్డి, మదన్ మోహన్, దేవయ్య, రజని ప్రియదర్శిని, కళ్యాణి , సునీత, వెంకన్న, జయంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో స్పీకర్‌ను కలిసిన మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు

**మర్యాదపూర్వకంగా సభాపతిని కలిసిన తెలంగాణ మంత్రులు**
**మార్చి 5న జరగనున్న కుమారుడి వివాహానికి ఆహ్వానించిన భట్టివిక్రమార్క**
**అంతకుముందు, కనకదుర్గమ్మను దర్శించుకున్న భట్టివిక్రమార్క**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అయ్యన్నపాత్రుడిని కలిశారు. ఈ సందర్భంగా తన కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహానికి రావాల్సిందిగా భట్టి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వారు కాసేపు ముచ్చటించుకున్నారు. కాగా, మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో భట్టివిక్రమార్క తనయుడి వివాహం జరగనుంది. అంతకుముందు, ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉదయం మల్లు భట్టివిక్రమార్క బెజవాడ కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం భట్టివిక్రమార్కకు పండితులు వేదాశీర్వచనం అందించారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# వాహనదారులు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

-బ్లాక్ స్పాట్ వద్ద పోలీసుల వినూత్న చర్యలు
-హెవీ వాహన డ్రైవర్లకు నేత్ర పరీక్షలు.
-ఉచితంగా కళ్లద్దాల పంపిణీ.




**ఫిబ్రవరి 27 జై భీమ్ ప్రతినిధి: (హనుమకొండ/ ఐనవోలు)**

అయినవోలు, శుక్రవారం: వరంగల్ కమిషనరేట్ సీపీ ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన "ఎరైవ్ అండ్ అలీవ్" రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా అయినవోలు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్‌గా గుర్తించబడిన పున్నేలు గ్రామ శివారులోని ఏకశిలా స్కూల్ సమీప జాతీయ రహదారి--563 వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయినవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది హెవీ వెహికల్స్ నడుపుతున్న డ్రైవర్లకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న డ్రైవర్లకు అక్కడికక్కడే ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. రోడ్డు ప్రమాదాలకు దృష్టి సమస్యలు కూడా కారణమవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎస్‌బి ఆప్టికల్స్ డాక్టర్ సుమన్‌కు అయినవోలు పోలీసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రహదారి భద్రతపై మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ డా. సత్య శారద



**వరంగల్, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం నిర్వహించిన జిల్లా నార్కోటిక్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణ, నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలు విక్రయించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న "స్ఫూర్తి" కార్యక్రమాల్లో నార్కోటిక్ అధికారులను భాగస్వామ్యం చేసి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు. ప్రస్తుత విద్యార్థులే రేపటి భారత పౌరులని పేర్కొంటూ, విద్యాలయాలు మరియు సమాజం మంచి మార్గనిర్దేశకులుగా ఉండాలని అన్నారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకుని విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ వారికి సరైన దిశానిర్దేశం చేయాలని సూచించారు. జిల్లాలోని ట్రాన్స్‌పోర్ట్ శాఖలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల ప్రాంతాల్లో పోలీసులు తరచూ పెట్రోలింగ్ నిర్వహిస్తే మత్తు పదార్థాల రవాణాను అరికట్టవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరంతర పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. అలాగే వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అనురాధతో మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులు పంట పొలాల పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏసీపీ వరంగల్ శుభం, నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, వర్ధన్నపేట ఏసీపీ నరసయ్య, డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు తదితర అధికారులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి యువతను రక్షించాల్సిన అవసరం ఉందని సమావేశంలో నిర్ణయించారు.

# చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌కు పితృవియోగం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి సౌందర్‌రాజన్ (90) వృద్ధాప్య సమస్యలతో శుక్రవారం కన్నుమూశారు. చిలుకూరులోని తన నివాసంలోనే ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సౌందర్‌రాజన్ చాలా సంవత్సరాలుగా చిలుకూరు బాలాజీ ఆలయంలో అర్చక సేవలు అందించారు. ఆధ్యాత్మిక సేవలో ఉంటూనే ఉన్నత విద్యను అభ్యసించడం ఆయన ప్రత్యేకత. కామర్స్ లెక్చరర్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ స్థాయి వరకు ఎదిగి పదవీ విరమణ చేశారు. ఆలయ సాంప్రదాయాలను పాటిస్తూనే విద్యా రంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. సౌందర్‌రాజన్‌కు ముగ్గురు కుమారులు కాగా, వారిలో రెండోవారైన రంగరాజన్ ప్రస్తుతం చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడిగా సేవలు అందిస్తున్నారు. సౌందర్‌రాజన్ మరణ వార్త తెలియగానే అర్చక సమాజం, భక్తులు, పలువురు ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నాటు సారా విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు

పంతీనీ గ్రామంలో ఎస్సై పస్తం శ్రీనివాస్ దాడి.
2 లీటర్ల గుడుంబా స్వాధీనం

**ఫిబ్రవరి 27 జై భీమ్ ప్రతినిధి:(హనుమకొండ / అయినవోలు)**

పంతీనీ గ్రామంలో నర్సర గుడుంబా విక్రయాలపై పోలీసుల కఠిన చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రోజున గుడుంబా అమ్మకాలు జరుగుతున్నాయన్న నమ్మదగిన సమాచారం అందడంతో అయినవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ సిబ్బందితో కలిసి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కుక్కల రవి (68), సాయిలు కుమారుడు, ముదిరాజ్, తన ఇంటి వద్ద గుడుంబా విక్రయిస్తూ ఉండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుండి సుమారు 2 లీటర్ల నర్సర గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై సమాచారం అందించిన వారిని గోప్యంగా ఉంచుతామని, ఇలాంటి చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. గ్రామాల్లో గుడుంబా విక్రయాలు పూర్తిగా నిర్మూలించే దిశగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ



సందర్భంగా కుక్కల రవి (68), సాయిలు కుమారుడు, ముదిరాజ్, తన ఇంటి వద్ద గుడుంబా విక్రయిస్తూ ఉండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుండి సుమారు 2 లీటర్ల నర్సర గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై సమాచారం అందించిన వారిని గోప్యంగా ఉంచుతామని, ఇలాంటి చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. గ్రామాల్లో గుడుంబా విక్రయాలు పూర్తిగా నిర్మూలించే దిశగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మాల సంఘాల జేఏసీ విలేకరుల సమావేశం




**హన్మకొండ, ఫిబ్రవరి 27 (జై భీమ్ న్యూస్)**

అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణతో మాలలను అణచివేసే కుట్రలు జరుగుతున్నాయని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులు ఆరోపించారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మందల భాస్కర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ, టీడీపీకి కోవర్టుగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ పాయింట్ల అమలు వల్ల విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ విధానం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. మాల సంఘాల విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ మదాసి రాహుల్ రావు మాట్లాడుతూ, వర్గీకరణ పేరుతో మాలలకు ఉన్న హక్కులను కుదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాలల ప్రాతినిధ్యాన్ని తగ్గించే చర్యలను సహించబోమని హెచ్చరించారు. మాల సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షులు చెరుకు రామచందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని పునఃపరిశీలించాలని కోరారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని తెలిపారు. ఈ సమావేశంలో బండి అశోక్, కంకణాల సంతోష్, దండు మోహన్, పానుగంటి లక్ష్మీనారాయణ, దండ్రి శ్రీనివాస్, గురిమిల్ల రాజు, శేషాద్రి నాగులు, కునముల్ల అనిత, దావా రవి తదితరులు పాల్గొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఆకస్మిక తనిఖీ

మంత్రి కొండా సురేఖ కఠిన చర్యలు
నలుగురు ఉద్యోగుల తొలగింపు - అర్చకుడికి చార్జ్ షీట్
ఈఓ, సూపరింటెండెంట్ సస్పెన్షన్‌కు ఆదేశం

**హైదరాబాద్, 27 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**





హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దేవాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఘటనపై కఠిన చర్యలు తీసుకున్నారు. తనిఖీ సందర్భంగా ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడం, పరిపాలనా లోపాలు వంటి అంశాలను మంత్రి గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. భక్తులకు ఇబ్బందులు కలిగే విధంగా వ్యవహరించడం అసహ్యకరమని ఆమె స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నలుగురు సిబ్బందిని సేవల నుండి తొలగించాలని మంత్రి ఆదేశించారు. స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) జి. రాము, అటెండర్ (రెగ్యులర్) ఎస్. శ్రీహరి, స్వీపర్ (ఔట్‌సోర్సింగ్) పి. నరసింహ, సీనియర్ అకౌంటెంట్ (ఔట్‌సోర్సింగ్) జి. ప్రభాకర్ రావులను విధుల నుండి తొలగించాలనే నిర్ణయం తీసుకున్నారు. అర్చకుడు ఎ. శ్రీనివాస చార్యులపై చార్జ్ షీట్ మెమో జారీ చేయాలని కూడా ఆదేశించారు. అదేవిధంగా, పరిపాలనా మరియు పర్యవేక్షణ లోపాల కారణంగా దేవాలయ సూపరింటెండెంట్ మరియు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)లను సస్పెండ్ చేయాలని సూచించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, తదుపరి కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశించారు. దేవాలయ నిర్వహణ పారదర్శకంగా ఉండాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేసినట్లు తెలిసింది.

# ఎస్‌డీజీల సమన్వయంతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం: ఆచార్య వి. రామచంద్రం





**హన్మకొండ, ఫిబ్రవరి 27 (జై భీమ్ న్యూస్)**

పేదరిక నిర్మూలన, ఆరోగ్య సేవల విస్తరణ, మహిళా సాధికారత, డిజిటల్ చేర్పు వంటి కీలక రంగాల్లో గణనీయ పురోగతి సాధించడం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో సోషల్ సైన్సెస్ మరియు ఆర్ట్స్ విభాగాల డీన్ ఆచార్య బి. సురేష్ లాల్ అధ్యక్షతన ఫిబ్రవరి 26--27 తేదీలలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు "ఇంటిగ్రేటింగ్ ఎస్‌డీజీస్ ఫర్ వికసిత్ భారత్ ఏ 2047: అచీవ్‌మెంట్స్ అండ్ పాత్‌వేస్" ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, వివిధ శాఖలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సూచించారు. డేటా ఆధారిత విధానాలు, రియల్-టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు, గ్రీన్ ఎకానమీ, పునరుత్పాదక శక్తి, వాతావరణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. యువత, మహిళలు, స్టార్టప్‌లు, ప్రైవేట్ రంగం భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. కాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ, 2047 నాటికి వికసిత్ భారత్ సాధన కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాకుండా సమానత్వం, పర్యావరణ సమతుల్యత, సామాజిక న్యాయం, సాంకేతిక ప్రగతితో కూడిన సమగ్ర అభివృద్ధిగా ఉండాలని స్పష్టం చేశారు. యు.జి.సి సమన్వయ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, ఎస్‌డీజీ లక్ష్యాలను దేశ జాతీయ అభివృద్ధి అజెండాతో సమన్వయం చేసుకుని వికసిత్ భారత్ సాధన దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, బోధనా--బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత అధ్యాపకులు పాల్గొన్నారు.

# బస్తీల బాట పట్టిన కిషన్ రెడ్డి

బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లలో పర్యటించిన కిషన్ రెడ్డి
బస్తీ వాసుల కష్టాలను అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి
మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈరోజు పర్యటించారు. గల్లీ గల్లీ తిరుగుతూ బస్తీ వాసుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డారు. బీజేపీని రాజకీయంగా దెబ్బతీసి, నగరాన్ని మజ్లిస్ పార్టీకి అప్పగించేందుకే ఈ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల సమస్యలను గాలికొదిలేశాయని విమర్శించారు. నగరంలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైందని, వర్షపు నీటి కాలువల్లో పూడిక తీయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవద్దని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ సమస్యలపై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పాలకవర్గం రద్దయిన నేపథ్యంలో, తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కిషన్ రెడ్డి

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - వల్భాపూర్‌లో జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు




**హన్మకొండ, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్భాపూర్‌లో ఘనంగా సైన్స్ సంబరాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీమతి పొనుగోటి శ్వేత, ఉప సర్పంచ్ అంబాల అనిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన సైన్స్ రంగోలీలు, ప్రదర్శించిన శాస్త్రీయ ప్రయోగాలు, మూఢనమ్మకాల నివారణపై ప్రదర్శించిన సైన్స్ నాటకం, సైన్స్ పుస్తక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అతిథులు ప్రతి ప్రదర్శనను ఆసక్తిగా పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ పొనుగోటి శ్వేత మాట్లాడుతూ, ప్రపంచ సైన్స్ రంగంలో భారతీయుల కృషి అపారమని పేర్కొన్నారు. ప్రాచీన కాలంలో ఆర్యభట్ట, భాస్కరాచార్య, వరాహమిహిర, చరకుడు, సుశ్రుతుడు, ఆచార్య నాగార్జున, కణాదుడు వంటి మహనీయులు శాస్త్ర ప్రపంచానికి పునాదులు వేశారు అన్నారు. అలాగే ఆధునిక కాలంలో సి.వి. రామన్, జగదీశ్ చంద్ర బోస్, హర గోవింద ఖోరానా, సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, ఎ.పి.జె. అబ్దుల్ కలాం, ఎం.ఎస్. స్వామినాథన్, ఎల్లాప్రగడ సుబ్బారావు, విక్రమ్ సారాభాయి వంటి శాస్త్రవేత్తలు భారత సైన్స్ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తార్కికంగా ఆలోచిస్తే శాస్త్రీయ దృక్పథం పెరుగుతుందని అన్నారు. మూఢనమ్మకాలను విడిచిపెట్టి ప్రయోగాత్మక విజ్ఞానాన్ని అలవర్చుకుంటే సమాజంలో శాస్త్రీయ వైఖరి పెంపొందుతుందని చెప్పారు. శాస్త్రీయ ఆలోచన మానవ పురోగతికి మూలాధారమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, వెంకట సుహాసిని, పద్మలత, రమాదేవి, కల్యాణి, శోభారాణి, అఖిల, పాఠశాల చైర్మన్ నీరజ తదితరులు పాల్గొన్నారు. జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో శాస్త్రీయ చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు విజ్ఞానంపై ఆసక్తిని మరింత పెంచాయి.

# మట్టి పాత్రలు ఆరోగ్యానికి మేలు

**వరంగల్, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

శనివారం జరగనున్న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ డైరెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ మట్టెవాడ ఉన్నత పాఠశాలలో శుక్రవారం “మట్టి పాత్రల తయారీ కార్యశాల (పాట్ మేకింగ్ వర్క్‌షాప్)”ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నలుగురు కుమ్మరి కళాకారులు పాల్గొని కుండలు మరియు ఇతర మట్టి పాత్రల తయారీ విధానాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. సారె (చక్రం) ఎలా తిరుగుతుందో, మట్టి ఎలా మలచి అందమైన కుండలుగా రూపుదిద్దుకుంటుందో విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. చేతితో మట్టిని మలచడం నుంచి తుదిరూపం దిద్దే వరకు మొత్తం ప్రక్రియను వారికి వివరించారు. జిల్లా సైన్స్ అధికారి, ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో రంగయ్య నాయుడు మాట్లాడుతూ, “పర్యావరణానికి అనుకూలమైన మట్టి పాత్రలను ఉపయోగించడం వల్ల ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రకృతి సంరక్షణకు దోహదం అవుతుంది. మట్టి పాత్రల తయారీ ఒక అద్భుతమైన సంప్రదాయ కళ” అని తెలిపారు. డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, “ప్రాచీన కాలంలో ఇంటి అవసరాలన్నీ మట్టితో తయారైన వంట పాత్రలు, నీటి నిల్వ పాత్రలు, ధాన్య నిల్వ పాత్రలతోనే నెరవేర్చేవారు. దీంతో ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా కుటీర పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందేవి” అని పేర్కొన్నారు. నేటి కాలంలో అల్యూమినియం, స్టీల్, నాన్‌స్టిక్ పాత్రల వినియోగం పెరిగి మట్టి పాత్రలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ మాట్లాడుతూ, “పాతకాలపు మట్టి పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా కుమ్మరి కళాకారులకు ఉపాధి కల్పించవచ్చు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవనశైలిని అలవరచుకోవాలి” అని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఆతిథ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ పర్యవేక్షించారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ప్రభాకర్, కిరణ్, సుభాషిణి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు, 100 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యశాలలో పాల్గొన్నారు.




# సీఎం రేవంత్‌తో మాజీ మావోయిస్టు నేతల భేటీ

**సచివాలయంలో సీఎంను కలిసిన ఆరుగురు మాజీ మావో నేతలు**

**సీఎంను కలిసిన వారిలో దేవ్‌జీ, రాజిరెడ్డి, బడే చొక్కారావు తదితరులు**

**పలు అంశాలపై చర్చలు జరిగినట్టు సమాచారం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



దశాబ్దాల పాటు అడవిని నమ్ముకుని సాయుధ పోరాటం చేసిన మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఇప్పుడు ప్రజాస్వామ్య మార్గంలోకి అడుగుపెడుతున్నారు. కేంద్రం చేపట్టిన ‘ఆపరేషన్ కగార్’ చివరి అంకానికి చేరుకోవడంతో, కీలక నేతలు వరుసగా లొంగిపోతున్నారు. ఈ క్రమంలో, హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆరుగురు మాజీ మావోయిస్టు నేతలు ఈరోజు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయిన సీనియర్ నేతలు తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), బడే చొక్కారావు (దామోదర్), నూనె నరసింహారెడ్డి (గంగన్న)లతో పాటు సుజాతక్క, చంద్రన్నలు ముఖ్యమంత్రిని కలిశారు. దశాబ్దాల అజ్ఞాతవాసం తర్వాత ఈ అగ్రనేతలంతా నేరుగా అధికార కేంద్రమైన సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రితో భేటీకి వెళుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు “సీఎంతో ఏం చర్చిస్తారు?” అని ప్రశ్నించగా, అగ్రనేత దేవ్‌జీ స్పందిస్తూ “పొలిటికల్ ఎజెండా” అని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. దీనితో వీరంతా భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. లొంగిపోయిన నేతల పునరావాసం, వారి కుటుంబాల భద్రతపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం వీరు చేపట్టబోయే తదుపరి కార్యాచరణపై సీఎంకు వివరించినట్లు సమాచారం.

# 38 మంది మావోయిస్టుల ఆచూకీపై వీడని చిక్కుముడి

**అడవి బాట పట్టిన వారి ఆచూకీపై వీడని మిస్టరీ**

**లొంగిపోయిన నేతల సమాచారంతో జాబితా సవరించామన్న పోలీసులు**

**తమ వారి వివరాలు చెప్పాలంటూ ఆందోళనలో కుటుంబ సభ్యులు**

**అడవుల్లో మరణాలు బయటకు రావని చెబుతున్న మాజీ మావోయిస్టులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



దశాబ్దాల క్రితం నమ్మిన సిద్ధాంతం కోసం అడవి బాట పట్టిన 38 మంది మావోయిస్టుల పేర్లను తెలంగాణ పోలీసులు తమ ‘వాంటెడ్’ జాబితా నుంచి తొలగించడం పెను సంచలనంగా మారింది. వారు బతికే ఉన్నారా లేక కాలగర్భంలో కలిసిపోయారా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ అనూహ్య పరిణామం తమ వారు ఏదో ఒకరోజు తిరిగి వస్తారని ఆశగా ఎదురుచూస్తున్న కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నింపుతోంది. గతేడాది వరకు తెలంగాణకు చెందిన 55 మంది మావోయిస్టులు అడవుల్లో క్రియాశీలకంగా ఉన్నారని చెప్పిన పోలీసులు, తాజాగా ఆ సంఖ్యను కేవలం 11కి తగ్గించడం గమనార్హం. ఈ విషయంపై డీజీపీ శివధర్ రెడ్డి స్పందిస్తూ ఇటీవల లొంగిపోయిన అగ్రనేతలను విచారించినప్పుడు ఈ 38 మంది గురించి ఎలాంటి సమాచారం లభించలేదని తెలిపారు. వారు చాలాకాలం క్రితమే పార్టీని వీడి ఉండవచ్చని లేదా మారుపేర్లతో ఎక్కడో రహస్యంగా జీవిస్తూ ఉండవచ్చని అంచనా వేస్తున్నట్లు వివరించారు. అందుకే వారిని జాబితా నుంచి తొలగించామని స్పష్టం చేశారు. అయితే, మాజీ మావోయిస్టు నేత జంపన్న వాదన మరోలా ఉంది. అడవిలో అనారోగ్యం, అంతర్గత కలహాలు లేదా ఎదురుకాల్పుల్లో జరిగే మరణాలు చాలా వరకు రహస్యంగానే ఉండిపోతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో దేవరకొండ సత్యనారాయణ (బుక్క సత్తన్న), కొల్లు శ్రీనివాసరెడ్డి, రంగు అరుణ, కాశబోయిన స్వరూప వంటి వారి కుటుంబ సభ్యులు తమ వారి ఆచూకీ కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.

# జిల్లాలో ఆహార భద్రత చట్టం పటిష్ట అమలు చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**హన్మకొండ, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ఆహార భద్రత చట్టం సమర్థవంతంగా అమలు కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎంఎల్ఎస్ పాయింట్లు, రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలకు బియ్యం పంపిణీ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అనే అంశంపై కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్మెంట్ సిబ్బంది వివరాలు, పీడీఎస్ బియ్యం పంపిణీలో అక్రమాలపై నమోదైన కేసుల స్థితిగతులను జిల్లా పౌర సరఫరాల అధికారి ఎండి. వాజిద్ అలీని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం డీలర్ల నియామకానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు. పాత బియ్యం నిల్వల (ఓల్డ్ స్టాక్) వివరాలను సమగ్రంగా సేకరించాలని సూచించారు. వర్షాల కారణంగా హాస్టళ్లు, పాఠశాలల్లో ఎక్కడైనా బియ్యం దెబ్బతిన్నట్లయితే వెంటనే ప్రత్యామ్నాయంగా నూతన బియ్యం సరఫరా చేయాలని, సంబంధిత వివరాలను జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్‌కు అందజేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం, సరుకులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎండి. వాజిద్ అలీ, జెడ్పీ సీఈవో శేషాద్రి, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, డిఆర్డిఓ మేన శ్రీను, డీఈఓ గిరిరాజు గౌడ్, ఎన్జీవో ప్రతినిధి డాక్టర్ అనితా రెడ్డి, జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లకు ఉచిత కంటి చికిత్స - అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా మడికొండ పోలీసుల చర్య




**మడికొండ, 27 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ పోలీస్ డీజీపీ శివదర్ రెడ్డి ఐపీఎస్ సూచనల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల ప్రకారం మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రహదారి భద్రత లక్ష్యంగా డీజీపీ ప్రవేశపెట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం రెండవ విడతలో 5వ రోజు దినచర్యలో భాగంగా, మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న లారీ, టిప్పర్, బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం సుమారు 45 మంది డ్రైవర్లను కాజీపేటలోని నవ దృష్టి కంటి ఆసుపత్రికు తీసుకెళ్లి అక్కడ డాక్టర్ సిస్టర్ లీలా ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ, రాత్రింబగళ్లు దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లకు కంటి చూపు బాగుండటం అత్యంత అవసరమని తెలిపారు. డ్రైవర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించడం డీజీపీ శివదర్ రెడ్డి ముందుచూపుకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకమని, తమ ఆరోగ్యంపై వారు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా



# అమిత్ షాను కలిసిన కొత్త జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న

**ఉదయ్‌పూర్ వేదికగా ఘనంగా విజయ్ దేవరకొండ, రష్మిక వివాహం**
**అమిత్ షాను రిసెప్షన్‌కు ఆహ్వానించిన విరోష్ జంట**
**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు**

తెలుగు చిత్రసీమలో మరో ప్రేమ జంట వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న మూడు ముళ్లు, ఏడు అడుగులతో ఒకటయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా, ఒకప్పటి రాచరికపు వైభవాన్ని తలపించే ప్యాలెస్‌లో నిన్న వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. ఇరు కుటుంబాల ఆచారాల ప్రకారం, రెండు భిన్న సంప్రదాయాల్లో జరిగిన ఈ వేడుకలో ఉదయం 10 గంటల శుభముహూర్తానికి రష్మిక మెడలో విజయ్ మూడు ముళ్లు వేశాడు. పెళ్లి జరిగిన కొన్ని గంటల్లోనే ఈ కొత్త జంట తమ వివాహ చిత్రాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "కొత్త ప్రయాణం మొదలైంది" అంటూ వారు పెట్టిన పోస్టులు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అభిమానులు, సినీ ప్రముఖులు పెద్ద ఎత్తున ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను విజయ్, రష్మిక ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా అమిత్ షాకు గణపతి వెండి విగ్రహాన్ని బహూకరించి, తమ వివాహ రిసెప్షన్‌కు రావాల్సిందిగా సాదరంగా ఆహ్వానించారు. పెళ్లికి ముందు ఇది జరిగినప్పటికీ... వీరి కలయికకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో విజయ్, రష్మిక రిసెప్షన్ ఏర్పాటు చేశారు. తాజ్ కృష్ణలో 4వ తేదీన సాయంత్రం 7 గంటలకు రిసెప్షన్ ప్రారంభమవుతుంది. ఈ రిసెప్షన్ కు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.

# ప్రధాని మోదీ నుంచి ఆశీస్సులు తీసుకున్న 'విరోష్'

**ఫోటో విడుదల చేసిన విజయ్ టీమ్**
**మార్చి 4న హైదరాబాద్ 'తాజ్ కృష్ణ'లో గ్రాండ్ రిసెప్షన్**
**ఆ వేడుకకు ప్రధానిని ఆహ్వానించిన విజయ్, రష్మిక**



రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో టాలీవుడ్ యాక్టర్లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహం అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. వివాహ బంధంలోకి అడుగుపెట్టడానికి ముందే ఈ జంట ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లూ గోప్యంగా ఉన్న ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను తాజాగా విజయ్ టీమ్ విడుదల చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రధాని మోదీని కలిసి ఆశీస్సులు తీసుకోవడంతో పాటు మార్చి 4న హైదరాబాద్ లో జరగనున్న తమ వెడ్డింగ్ రిసెప్షన్ కు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రధాని నూతన దంపతులకు తన శు భాకాంక్షలు తెలియజేసినట్లు సమాచారం. కాగా, ఉదయ్‌పూర్ లో కేవలం అత్యంత సన్నిహితుల మధ్యే 'విరోష్' పెళ్లి జరగగా, చిత్ర పరిశ్రమ, రాజకీయ మరియు క్రీడా రంగాలకు చెందిన ప్రముఖుల కోసం హైదరాబాద్‌లో భారీ రిసెప్షన్ ప్లాన్ చేశారు. మార్చి 4న జరగబోయే ఈ వేడుకకు దేశవ్యాప్తంగా ఉన్న సినీ దిగ్గజాలు హాజరుకాబోతున్నారు.

# కమిటీ పేరుతో కాలయాపన ఇంకా ఎంత కాలం ఈ నిరీక్షణ?

**అన్నీ చేస్తున్నారు దీన్నే నాన్చుతున్నారు.**
**ఎవరు చేసిన తప్పు ఎవరిని భాద్యులను చేస్తున్నారు.**
**విద్యార్థులను వేదిస్తే అధికారులకు వచ్చే లాభమేంది.**
**గంగా "నది" నడిసంద్రంలో మునిగిన సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపిస్తారు.**
**మాకే ఎందుకీ శిక్షా మమ్మల్నే ఎందుకిలా మానసికంగా చంపుతున్నారు.**
**విద్యార్ధాలను వేదించడానికి కొత్త కోణం కమిటీ కాలయాపన.**
**అధికారుల వేధింపులు ఇంకెంతకాలం.**
**ఆశావాహక పరిషోదక విద్యార్ధి రోధణ.**




**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

కమిటీ పేరుతో కాలయాపన ఇంకా ఎంత కాలం ఈ నిరీక్షణ? ఇప్పటికే అన్ని స్థాయిలలో ఆమోదం పొందిన ఒక న్యాయమైన విద్యా హక్కును అమలు చేయడానికి ఎందుకు ఇంత ఆలస్యం జరుగుతోంది? అర్హత ఉన్న, అధికారికంగా గుర్తింపు పొందిన విద్యార్థులను ఇంకా ఎంత కాలం నిరీక్షణలో ఉంచుతారు? ఈ ప్రశ్నలు ఈ రోజు కేవలం 33 మంది విద్యార్థులవే కాదు మొత్తం విద్యా వ్యవస్థ న్యాయబద్ధతను ప్రశ్నిస్తున్నాయి. 2021--22 సంవత్సరానికి సంబంధించిన పీ హెచ్డీ ప్రవేశాల ప్రక్రియలో, కాకతీయ విశ్వవిద్యాలయం ప్రకటించిన సీట్లకు మించి ప్రవేశాలు కల్పించడం వల్ల కొంతమంది అర్హులైన విద్యార్థులు అన్యాయానికి గురయ్యారు. ఇది ఒక పరిపాలనా లోపం మాత్రమే కాదు, విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన తీవ్రమైన తప్పిదం. ఈ అన్యాయాన్ని సరిదిద్దడానికి విశ్వవిద్యాలయం స్వయంగా ముందుకు వచ్చి, 33 మంది విద్యార్థులకు సూపర్ న్యూమెరరి సీట్ల కింద ప్రవేశాలు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) కు సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీజీసిహెచ్ఈ) 33 మంది విద్యార్థులకు ఆమోదం తెలిపింది. దీనిని అనుసరించి డీన్స్ సమావేశంలో కూడా స్పష్టమైన తీర్మానం జరిగింది. అంతేకాకుండా, 30.12.2025 తేదీన జరిగిన పాలకమండలి సమావేశంలో గౌరవనీయులైన ఉన్నత విద్యా ప్రిన్సిపాల్ సెక్రటరీ కూడా సూపర్ న్యూమెరరి కింద పీ హెచ్డీ ప్రవేశాలకు అధికారికంగా ఆమోదం తెలిపారు. అంటే, అన్ని స్థాయిలలో విశ్వవిద్యాలయం, ఉన్నత విద్యామండలి,ప్రభుత్వ స్థాయి పూర్తిస్థాయిలో ఆమోదం లభించింది. ఇంతవరకు అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక కూడా, ఇప్పటి వరకు విద్యార్థులకు సీట్లు కేటాయించకపోవడం అత్యంత బాధాకరం. కమిటీ పరిశీలనలో ఉంది, ఫైల్ ప్రాసెస్‌లో ఉంది, ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది వంటి కారణాలతో కాలయాపన కొనసాగుతోంది. ఈ పరిస్థితిలో ఒక ముఖ్యమైన ప్రశ్న ఎదురవుతోంది. కమిటీ పేరుతో కాలయాపన ఇంకా ఎంత కాలం? ఇప్పటికే ఆమోదం పొందిన ఒక అంశాన్ని అమలు చేయడానికి మరిన్ని కమిటీలు ఎందుకు అవసరం? ఈ కమిటీలు సమస్య పరిష్కారం కోసం ఉన్నాయా, లేక సమస్యను మరింత ఆలస్యం చేయడానికే ఉన్నాయా? ఈ ఆలస్యం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. వారు తమ విద్యా ప్రస్థానాన్ని కొనసాగించలేక, అనిశ్చితిలో జీవిస్తున్నారు. వారి పరిశోధన కలలు నిలిచిపోయాయి. వారి జీవితంలో అత్యంత ముఖ్యమైన సమయం నిరీక్షణలో గడుస్తోంది. ఇది కేవలం ఒక పరిపాలనా ఆలస్యం కాదు ఇది వారి భవిష్యత్తును నిలిపివేయడం. భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమానత్వపు హక్కును (ఆర్టికల్14) గౌరవప్రదమైన జీవితం, విద్యను అభ్యసించే హక్కును (ఆర్టికల్ 21) హామీ ఇస్తుంది. ఇప్పటికే అధికారికంగా ఆమోదించబడినప్పటికీ ప్రవేశాలు నిరాకరించడం ఈ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలి. ఒక విద్యార్థికి విద్యను అందించాల్సిన విశ్వవిద్యాలయం, అదే విద్యార్థిని నిరీక్షణలో ఉంచడం అత్యంత విచారకరం. కమిటీలు సమస్య పరిష్కారం కోసం ఉండాలి, సమస్యను ఆలస్యం చేయడానికి కాదు. పరిపాలన బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఇప్పటికే ఆమోదించబడిన 33 మంది విద్యార్థులకు వెంటనే సూపర్ న్యూమెరరి సీట్లు కేటాయించాలి. ఇది కేవలం ఒక పరిపాలనా ప్రక్రియ పూర్తి చేయడం మాత్రమే కాదు, ఇది న్యాయం చేయడం.



# విజయ్-రష్మిక పెళ్లి.. కిలోల కొద్దీ బంగారంతో కొత్త ట్రెండ్ సృష్టించిన జంట!

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

స్టార్ హీరో విజయ్ దేవరకొండ, ప్రముఖ నటి రష్మిక మందన్న ఎట్టకేలకు ఒక్కటయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా నిన్న వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో అందరి దృష్టినీ ఆకర్షించింది మాత్రం వధూవరులు ధరించిన భారీ బంగారు ఆభరణాలే. సింపుల్, మినిమల్ డిజైన్ల ట్రెండ్ నడుస్తున్న ఈ రోజుల్లో, కిలోల కొద్దీ బరువైన సంప్రదాయ టెంపుల్ జ్యువెలరీ ధరించి ఈ జంట సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్‌కు తెరలేపింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆభరణాల సంస్థ 'శ్రీ జ్యువెలర్స్' ఈ నగలను ప్రత్యేకంగా డిజైన్ చేసింది. వధూవరుల అభిరుచికి, దక్షిణాది సంస్కృతికి అద్దం పట్టేలా ఈ ఆభరణాలను రూపొందించారు. విజయ్ దేవరకొండను ఒక పౌరాణిక రాజుగా ఊహించుకుని, ఆయన ఆభరణాలను డిజైన్ చేశారు. ఏనుగు (వివేకానికి చిహ్నం), పులి (వేగానికి ప్రతీక) వంటి మూలాంశాలతో పాటు పూల డిజైన్లతో నక్షి చెక్కడాలు జోడించి ఈ నగలను తయారు చేశారు. పెద్ద సైజు చెవి దిద్దులు, చేతి కడియాలు, మెడలో రెండు భారీ హారాలు, భుజకీర్తులు, చివరికి కాలికి కూడా కడియాలు ధరించి విజయ్ అందరినీ ఆశ్చర్యపరిచారు. మరోవైపు రష్మిక మందన్నను ఒక దేవతలా భావించి ఆమె ఆభరణాలను తీర్చిదిద్దారు. దక్షిణాది ఆలయాల వాస్తు శిల్పం స్ఫూర్తితో రూపొందించిన ఈ నగలలో నక్షి, రవ్వ పనితనం ఉట్టిపడింది. ఆమె మొత్తం 11 రకాల ఆభరణాలు ధరించారు. చోకర్, హారాలు, స్టేట్‌మెంట్ జుంకాలు, జడ బిళ్లలు, పాపిడి బిళ్ల, ముక్కుపుడక, గాజులు, వడ్డాణం, బాజుబంద్, కాలి పట్టీలతో రష్మిక పెళ్లికూతురిగా రాజసంగా కనిపించారు. ఈ అద్భుతమైన ఆభరణాల రూపకల్పనకు సుమారు 10 నెలల సమయం పట్టిందని శ్రీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్లు అభిషేక్ అగర్వాల్, కౌశిక్ కుమార్ తెలిపారు. "విజయ్, రష్మికల పెళ్లి వేడుకలో భాగం కావడం ఎంతో సంతోషంగా ఉంది. వారి ఆలోచనలకు అనుగుణంగా, వారసత్వ సంపదగా నిలిచిపోయేలా ఈ నగలను తీర్చిదిద్దాం" అని వారు వివరించారు. ప్రస్తుతం ఈ జంట పెళ్లి ఫొటోలు, ముఖ్యంగా వారి ఆభరణాల డిజైన్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM